# సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 26 । జూలై । 2024

I




## ఆగని వన్యప్రాణుల వేట II లో▸

జిల్లాలోని అడవుల్లో వన్యప్రాణుల వేటకు అడ్డుకట్ట పడడం లేదు. విద్యుత్ ఉచ్చులతో హతమార్చుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.



## ఎల్లంపల్లి @ 14టీఎంసీలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 20.175 టీఎంసీలకు గాను గురువారం 14.820టీఎంసీలకు చేరింది. కడెం ప్రాజెక్టు నుంచి 13వేల క్యూసెక్కులు, ఎగువ ప్రాంతాల నుంచి 8,500 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది.

గరిష్ఠం/కనిష్ఠం
28.0 /25.0

## వాతావరణం

చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

## న్యూస్‌రీల్

### నేడు కేటీఆర్, ఎమ్మెల్యేల రాక

రామకృష్ణాపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కాళేశ్వరం ప్రాజెక్ట్ సందర్శన అనంతరం శుక్రవారం మంచిర్యాల జిల్లా క్యాతనపల్లికి రానున్నారు. చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఇంట్లో మధ్యాహ్నం ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావులు మీడియాతో మాట్లాడనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

### గురుకుల ఇంటర్‌లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

మంచిర్యాలఅర్బన్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ పరిధిలోని జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్, ఒకేషనల్ గ్రూపుల్లో ఖాళీల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జోనల్ అధికారి అరుణాకుమారి తెలిపారు. ఈ నెల 26న సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయం లక్సెట్టిపేట, 28న గురుకుల విద్యాలయ బాలుర సీఈవో బెల్లంపల్లిలో స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉదయం 9గంటలకు అడ్మిషన్ సెంటర్‌కు హాజరు కావాలని తెలిపారు. 2024లో ఒకే ప్రయత్నంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం పట్టణ ప్రాంతంలో రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతంలో రూ.1.50లక్షలు మించకుండా ఉండాలని తెలిపారు.

### 'రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు మొండిచేయి'



మాట్లాడుతున్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాకు ఎలాంటి నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ముగ్గురు అధికార పార్టీ ఎమ్మెల్యేలున్నా సరిపడా నిధులు తేవడంలో విఫలమయ్యారని అన్నారు. మంచిర్యాలలోని గోదావరి నదిపై వంతెన, గూడెం ఎత్తిపోతలు చివరి ఆయకట్టు వరకు విస్తరణ, రాళ్లవాగుపై కరకట్ట, మాతాశిశు, మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి నిధులు కేటాయించలేదని అన్నారు. గత ఐదేళ్లుగా చెన్నూరు నియోజకవర్గంలో పంటలు నీట మునిగి నష్టపోతున్నా పరిహారం చెల్లింపులు లేవని, జిల్లాకు జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల కూడా ప్రకటించలేదని తెలిపారు. సింగరేణి ద్వారా వేలాది కోట్లు రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లిస్తున్నా ఇక్కడ ఖర్చు చేయడం లేదని పేర్కొన్నారు.


### కార్గిల్ అమరులకు ఘన నివాళి



కాగడాల ర్యాలీలో బీజేవైఎం నాయకులు

మంచిర్యాలటౌన్: కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా మంచిర్యాల పట్టణంలో గురువారం సాయంత్రం బీజేవైఎం ఆధ్వర్యంలో కాగడాల ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస థియేటర్ నుంచి ముఖరం చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి కార్గిల్‌లో అమరులైన సైనికులకు నివాళులు అర్పించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సెవెళ్ల మహేందర్, పెద్దపల్లి పార్లమెంటు ఇన్‌చార్జి తుల ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు బొలిశెట్టి అశ్విన్, అమిరిశెట్టి రాజు, మోటపలుకుల తిరుపతి, బొద్దున మల్లేశ్, మద్ది సుమన్, పల్లి రాకేశ్, ప్రదీప్, సత్యనారాయణ, వెంకటేశ్, రెడ్డిమల్ల అశోక్, రాకేశ్ రెన్వా, సిద్ధార్థ, వంశీ పాల్గొన్నారు.

### పోలీస్‌స్టేషన్లలో డీసీపీ తనిఖీ



భీమినిలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీసీపీ

నెన్నెల/భీమిని: నెన్నెల, భీమిని, కన్నెపల్లి మండలాల్లోని పోలీసుస్టేషన్లను మంచిర్యాల డీసీపీ భాస్కర్ గురువారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా పోలీసుస్టేషన్లను సందర్శించి రికార్డులు పరిశీలించారు. నెన్నెల పోలీసుస్టేషన్‌లో నమోదవుతున్న కేసులు, సిబ్బంది వివరాలు ఎస్సై ప్రసాద్‌ను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు పరిష్కరించాలని, స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. భీమిని, కన్నెపల్లి స్టేషన్లలో రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, లాకప్, టెక్నికల్ రూంలు పరిశీలించారు. బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తాండూర్ సీఐ కుమారస్వామి, ఎస్సైలు విజయ్‌కుమార్, గంగారాం పాల్గొన్నారు.

# గోదారి ముంపునకు గోడ

- బడ్జెట్‌లో ముంపు నివారణకు నిధులు అంచనా
- జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు
- ఇందిరమ్మ ఇళ్లు, సంక్షేమ పథకాలతో ఊరట
- జిల్లాకు నిధుల కేటాయింపుతో ఉపశమనం



మంచిర్యాల పట్టణ పరిధిలో గోదావరి నది

ఆర్కేపీలో నిర్మాణం పూర్తయిన డబుల్ ఇళ్లు(ఫైల్)

కవ్వాల్ టైగర్ రిజర్వు కేంద్రం

నీల్వాయి ప్రాజెక్టు



సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: వరదలతో మంచిర్యాల పట్టణానికి ప్రతీ ఏడాది ఇబ్బంది ఎదురవుతున్న తరుణంలో ఈ ఏడాది బడ్జెట్‌లో గోదావరి నదీతీరంలో గోడ నిర్మాణానికి నిధులు అంచనా వేయడంతో జిల్లా కేంద్రంతోపాటు పరిసర ప్రాంత ప్రజలకు ఊరటనిస్తోంది. ఈసారి బడ్జెట్ అంచనా రూ.348.99కోట్లు ప్రతిపాదించడంతో ఆశలు చిగురిస్తున్నాయి. గత మూడేళ్లుగా భారీ వర్షాలకు పట్టణంలో ముంపు ప్రాంతాలతోపాటు రాళ్లవాగు బ్యాక్‌వాటర్‌తో ఇబ్బందులు ఎదురవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాజా బడ్జెట్‌లో నిధులు అంచనా వేశారు. దీంతో పరిసర కాలనీలు, మాతాశిశు సంరక్షణ భవనంతోపాటు చుట్టుపక్కల నివాసయోగ్యానికి ముప్పు తగ్గే అవకాశం ఉంది. ఈ మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 2024–25 బడ్జెట్‌లో నిధుల అంచనాను ప్రస్తావించారు. జిల్లా పరిధిలో పలు అభివృద్ధి పనులకు కేటాయింపులు జరగడం కొంత ఊరటనిస్తోంది.

**సాగునీటి ప్రాజెక్టులకు నిధులు..**

సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,031 కోట్లు కేటాయింపుతో జిల్లా పరిధిలోని భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల మరమ్మతులు, నిర్వహణకు ఉపయోగపడనున్నాయి. మంచిర్యాల చీఫ్ ఇంజినీర్ ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో భారీ నీటిపారుదల శాఖకు రూ.22.45 కోట్లు కేటాయించారు. ఈ నిధులు సిబ్బంది జీతభత్యాలు, ఖర్చులు, రవాణా ఇతరత్రా ఖర్చులకే వెచ్చిస్తారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల కింద నిధుల కేటాయింపులు చేస్తూ బడ్జెట్‌లో అంచనా వేశారు.

**విద్య, సంక్షేమానికి నిధులు**

రాష్ట్ర వ్యాప్తంగా 65ఐటీఐ కళాశాలలను నైపుణ్య కేంద్రాలుగా తీర్చిదిద్దనున్న నేపథ్యంలో జిల్లాలోనూ ఐటీఐ చదివే విద్యార్థులకు నైపుణ్య వృద్ధితో మేలు జరగనుంది. అన్నీ ఒకేచోట కలిపి అంతర్జాతీయ స్థాయిలో గురుకులాల ఏర్పాటు చేస్తామని మంత్రి భట్టి ప్రకటించారు. దీంతో జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు ఒకేచోట ఏర్పాటుకు కసరత్తు జరిగే అవకాశం ఉంది. గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కే సమయంలో ఉపయోగపడే కిట్‌ను దశలవారీగా అందజేస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలోని కల్లుగీత వృత్తిదారులకు మేలు జరుగుతుంది.

**ఎకోటూరిజంగా కవ్వాల్ టైగర్ రిజర్వు**

రాష్ట్ర వ్యాప్తంగా ఎనిమిది అటవీ ప్రాంతాలను ఎకో టూరిజంగా గుర్తించగా, జిల్లా పరిధిలో కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రం పర్యాటకంగా అభివృద్ధికి దోహదపడనుంది. ఈ బడ్జెట్‌లో అడవులు, పర్యావరణ రక్షణకు రూ.1064 కోట్లు కేటాయించడంతో జిల్లా పరిధిలో 1.76లక్షల హెక్టార్లలో విస్తరించిన అడవుల పెంపునకు ఉపయోగపడనున్నాయి.

**సాగునీటి ప్రాజెక్టుల కేటాయింపులు**

| |
|---|
| గొల్లవాగు రూ.31.20 లక్షలు |
| అడ(కుమురం భీం) రూ.15.60 లక్షలు |
| నీల్వాయి రూ.328 కోట్లు (భూ సేకరణ, పునరావాసం) |
| ప్రాణహిత-చేవెళ్ల రూ.248.9 కోట్లు |
| ర్యాలీ ప్రాజెక్టు రూ.4 కోట్లు |
| జగన్నాథ్‌పూర్ రూ.12.32 కోట్లు |

**హెల్త్ డిజిటల్‌కార్డులు..**

వైద్యారోగ్య పరిధిలో ప్రతీ ఒక్కరి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ కార్డు జారీ చేయడం, ఆరోగ్యశ్రీలో చికిత్స సంఖ్య పెంపు ఉపయోగపడనుంది. జిల్లాలో 17పీహెచ్‌సీలు, మూడు సీహెచ్‌సీలు ఉన్నాయి. స్త్రీ శిశు సంక్షేమ శాఖకు రూ.2,736కోట్లు ప్రకటించడంతో జిల్లాలో మొత్తం అంగన్‌వాడీలు 969 ఉండగా, 40,919మంది చిన్నారులు ఉన్నారు. 8వేలకు పైగా గర్భిణులు, బాలింతలకు ప్రయోజనం కలుగుతుంది.

**మహిళా సంఘాలకు లబ్ధి..**

ఇందిరా జీవిత బీమా పథకంలో రూ.10లక్షల జీవిత బీమాను బడ్జెట్‌లో కొనసాగిస్తామని తెలిపారు. దీంతో జిల్లాలోని 11వేల స్వయం సహాయక బృందాల మహిళలకు ఉపయుక్తం కానుంది. ఏటా రూ.20వేల కోట్ల రుణాలు ఇచ్చే లక్ష్యం ఉండడంతో జిల్లాలోనూ మహిళా సంఘాలకు మేలు కలుగుతుంది. ప్రతీ నియోజకవర్గంలో మైక్రోస్మాల్ ఇండస్ట్రీ ఏర్పాటు చేయడం, మహిళలకు కేటాయించడంతో జిల్లాలోని మహిళలు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉంది.

**ఇందిరమ్మ ఇళ్లకు యోగం**

ఇల్లు కట్టుకుంటే రూ.5లక్షల సాయం, ఎస్సీ, ఎస్టీలకు రూ.6లక్షల చొప్పున ఇవ్వడంతోపాటు ఈ ఏడాదిలో ప్రతీ నియోజకవర్గంలో కనీసం 3500ఇళ్ల చొప్పున కట్టిస్తామని పేర్కొనడంతో జిల్లా పరిధిలో 10,500 ఇళ్ల నిర్మాణానికి ఆస్కారం ఏర్పడింది. డబుల్ బెడ్రూం ఇళ్లను పంపిణీ చేస్తామని ప్రకటించారు.

**పంచాయతీలకు పక్కా భవనాలు**

పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తామని పేర్కొనడంతో జిల్లాలో మొత్తం 311 జీపీలు ఉండగా, ఇంకా 159 పంచాయతీలకు పక్కా భవనాలు లేవు. ఈ బడ్జెట్‌తో కొత్త భవనాలు వచ్చే అవకాశం ఉంది. ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తామని ప్రకటించారు. దీంతో జిల్లాలో ఇప్పటికే ప్రగతిలో ఉన్న 469సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యే అవకాశం ఉంది.

## వీడని ముసురు

- వారం రోజుల్లో 212.2 మిల్లీమీటర్లు
- పొంగిన వాగులు, నిండిన చెరువులు



వేమనపల్లి: మునిగిన రాచర్ల హైలెవల్ వంతెన

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఈ నెల 19 నుంచి ఓ మోస్తారు నుంచి భారీ వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉన్నాయి. బుధవారం నుంచి గురువారం రాత్రి వరకు ముసురు వాన పడుతూనే ఉంది. జిల్లా సరిహద్దులో ప్రాణహిత నది ఉధృతంగా ప్రవహిస్తోంది. లోతట్టు ప్రాంతాల్లోని పంట పొలాలు నీటమునిగి ఉండడంతో మురిగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్ నెలలో జిల్లా సగటు వర్షపాతం 30శాతం లోటు నెలకొంది. గత వారం రోజుల వ్యవధిలో 212.2 మిల్లీమీటర్ల వర్షం కురిసి రెట్టింపు కన్న ఎక్కువ వర్షపాతం నమోదైంది. చెరువులు, కుంటలు, జలాశయాల్లోకి వరద నీరు చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు పడిపోతుండడం, చల్లని ఈదురుగాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు మంచం పడుతున్నారు. జలుబు, శ్వాసకోశ వ్యాధులు, వైరల్ జ్వరాలతో ఆస్పత్రి పాలవుతున్నారు. మరో రెండ్రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

**జిల్లాలో నమోదైన వర్షం..**

గురువారం తెలికపాటి నుంచి ఓ మోస్తారు వర్షం కురువగా 18.2మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జన్నారం మండలంలో 23.3 మిల్లీమీటర్లు, దండేపల్లిలో 23.6, లక్సెట్టిపేటలో 18.9, హాజీపూర్‌లో 19.1, కాసిపేటలో 15, తాండూర్‌లో 121, భీమినిలో 15.7, కన్నెపల్లిలో 19.1, వేమనపల్లిలో 25.1, నెన్నెలలో 18.4, బెల్లంపల్లిలో 14.7, మందమర్రిలో 10.6, మంచిర్యాలలో 15.2, నస్పూర్‌లో 15.6, జైపూర్‌లో 16, భీమారంలో 19, చెన్నూర్‌లో 21, కోటపల్లిలో 24.8 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. జూన్ నుంచి ఇప్పటి వరకు జిల్లా సాధారణ వర్షపాతం 416.5 మిల్లీమీటర్లు కాగా 486.9 మి.మీ కురిసింది. 17శాతం అధికం నమోదైంది.

# కొలతలు తారుమారు..!

మంచిర్యాలలోని హరిజన వాడ, రాళ్లపేట్ ప్రాథమిక పాఠశాలల్లో 69 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి పంపిణీ చేసిన యూనిఫాంలు పొట్టిగా, పొడుగ్గా ఉన్నాయి. దుస్తుల జేబులు ఊడిపోయి, దారం పోగులు లేచి అసౌకర్యంగా మారాయి. కొన్ని పాఠశాలల్లో కొలతలు తారుమారైన విషయాన్ని గ్రహించిన అధికారులు యూనిఫాంలు వెనక్కి పంపించారు. ఒకే జత యూనిఫాం అందడంతో రంగుల దుస్తులతోనే బడికి వస్తున్నారు. మరో జత ఇప్పటికీ అందలేదు.

- ప్రభుత్వ స్కూల్ యూనిఫాం పొట్టిగా.. పొడుగ్గా..
- నెలదాటినా పంపిణీ కాని రెండో జత
- విద్యార్థులకు తప్పని ఇబ్బందులు



హరిజనవాడ, రాళ్లపేట స్కూల్‌లో సివిల్ డ్రెస్‌లో విద్యార్థులు



హరిజనవాడ పాఠశాలలో ప్యాకెట్ చిరిగి, ఎగుడు దిగుడు యూనిఫామ్‌తో విద్యార్థి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ బడుల్లో పంపిణీ చేసిన యూనిఫాంలు విద్యార్థులను నిరాశకు గురిచేస్తున్నాయి. కొలతలు తారుమారు కావడంతో అసౌకర్యంగా మారాయి. జిల్లాలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ముడి వస్త్రానికి సంబంధించిన లెక్కలు తీసి ముందస్తు చర్యలు చేపట్టినా యూనిఫాంల పంపిణీ ప్రక్రియ కొనసాగుతూనే ఉంది. స్వయం సహాయక సంఘాలను గుర్తించి ఆయా పాఠశాలలకు సంబంధించిన విద్యార్థుల యూనిఫామ్ వస్త్రాన్ని అప్పగించారు. ఒక్కో విద్యార్థి నుంచి కొలతలు తీసుకోకుండా యూనిఫాం కుట్టడం వల్ల ఎగుడు.. దిగుడుగా వచ్చాయి. రెండో విడతలో పంపిణీ చేయాల్సిన మరో జతపై ఇంకా స్పష్టత లేకుండా పోయింది. ఇప్పటికీ ముడివస్త్రం జిల్లాకు చేరకపోవడంతో యూనిఫాం కుట్టి పంపిణీ చేసేదెన్నడో తెలియకుండా పోయింది.

**పంపిణీ ఇలా..**

సర్కారు బడుల్లోని విద్యార్థులకు ఏకరూపతను చాటేలా యూనిఫాం పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అందరికీ రెండు జతల యూనిఫాం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ ఏడాది 774 పాఠశాలల్లో 43,614మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందించాల్సి ఉంది. ఇందులో భాగంగా ఒక జతకు అవసరమైన 96,750 మీటర్ల ముడివస్త్రం జిల్లాకు చేరింది. 961 స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్ఎంసీల పదవీ కాలం ముగియడంతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను భాగస్వామ్యం చేశారు. మొదటి ఒక జత యూనిఫాం కుట్టించేందుకు పీఎంశ్రీ కింద ఎంపికైన 27పాఠశాలల్లోని 6,712 మంది విద్యార్థుల యూనిఫాంకు సంబంధించి కుట్టుకూలి రూ.3,40,600 ఖాతాల్లో జమయ్యాయి. 747 స్కూళ్లలో 36,907 మంది విద్యార్థుల యూనిఫాంలు కుట్టించేందుకు రూ.18,45,100 మంజూరయ్యాయి. స్వయం సహాయక సంఘాలు బ్యాంకు ఖాతాలు తెరవగానే జమ చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**తల్లిదండ్రులపై ఆర్థిక భారం**

తోటి విద్యార్థులు యూనిఫాం వేసుకుని వస్తుండగా.. అందని వారు చిన్నబుచ్చుకుంటున్నారు. కొందరు విద్యార్థులు మరో జత యూనిఫాం కోసం తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తుండడంతో దుకాణాల్లో కొనుగోలు చేస్తున్నారు. యూనిఫామ్‌లు అందని వారూ కొనుగోలు చేయాలని పట్టుబడుతున్నారు. యూనిఫాం పంపిణీ చేసి ఆర్థిక భారం తగ్గించాలని పలువురు కోరుతున్నారు.

**ఒకే జతతో ఇబ్బందులు..**

రెండో జతకు సంబంధించిన ముడి వస్త్రం ఇప్పటికీ జిల్లాకు చేరలేదు. స్వయం సహాయక సంఘాలకు చేరి కుట్టిన తర్వాత పంపిణీ చేసే వరకు మరో నెల పట్టే అవకాశాలున్నాయి. ఒకే జత కారణంగా విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వర్షాకాలం కావడంతో తడిస్తే మరో రోజు సాధారణ దుస్తుల్లో బడికి వస్తున్నారు. రోజూ యూనిఫాంను ఉతికి ఆరేయడంతో రంగు వెలిసి పాతవాటిగా కనిపిస్తున్నాయి. కొన్ని పాఠశాలల్లో శరీరాకృతి పరంగా వ్యత్యాసం (యూనిఫాం కొలతలు) ఉండడంతో పొట్టిగా, పొడుగ్గా ఉన్న విషయం తెలియడంతో మళ్లీ వెనక్కి పంపించారు. కొత్తగా వచ్చిన వారికి ఎలా అందిస్తారో స్పష్టత లేకుండాపోయింది. యూనిఫాంలు పంపిణీ చేశారనే మాటే కానీ ఒక జత దుస్తుల కారణంగా చాలామంది రంగు దుస్తుల్లోనే బడికి వస్తున్నారు. అక్కడక్కడ విద్యార్థులకు మొదటి జతనే అందలేదు. ఉపాధ్యాయులు కూడా ఏమీ అనలేని పరిస్థితి.

**సకాలంలో యూనిఫామ్‌లు**

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులందరికీ సకాలంలో ఒక జత యూనిఫామ్ అందజేశాం. జిల్లాకు సంబంధించిన ముడి వస్త్రం సరఫరాపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం. ఒక్కటి రెండు రోజుల్లో వస్త్రం వచ్చే అవకాశాలున్నాయి. పాఠశాలలకు చేర్చే క్రమంలో యూనిఫామ్‌లు ఏవైనా మారి ఉండొచ్చు. సైజు చిన్నవిగా ఉన్న పాఠశాలలను గుర్తించి విద్యార్థులకు అవసరమైన దుస్తులు అందేలా చర్యలు చేపట్టాం.

– యాదయ్య, డీఈవో

## ప్రభుత్వ కార్యాలయాల్లో కలెక్టర్ తనిఖీ



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఎన్‌ఎంలు

నెన్నెల: మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాలు, పీహెచ్‌సీని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజాపాలన, ధరణి హెల్ప్‌డెస్క్ నిర్వహణ విధానాన్ని పరిశీలించారు. అర్జీదారు వివరాలను స్వయంగా దగ్గరుండి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ధరణి సహాయక కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచవద్దని తహసీల్దార్ సబ్బ రమేష్‌ను ఆదేశించారు. అనంతరం పీహెచ్‌సీని సందర్శించి మందులు, సిబ్బంది వివరాలు మెడికల్ ఆఫీసర్ లక్ష్మణ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ దేవేందర్‌రెడ్డి, ఎంపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**సిబ్బందిని నియమించాలని వినతి**

పీహెచ్‌సీలో సిబ్బందిని నియమించాలని ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సిబ్బంది కొరత కారణంగా డే, నైట్ డ్యూటీ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌ఓతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. పీహెచ్‌సీ ఫీల్డ్‌స్టాఫ్ చంద్రకళ, గంగ, భూదమ్మ, సుజాత, లక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బదిలీలు సరే.. వచ్చేవారెవరు..?

- మంచిర్యాల మున్సిపాలిటీలో 118 పోస్టులు ఖాళీలు
- సాధారణ బదిలీల్లో అరకొర కేటాయింపులు
- ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాలపై ప్రభావం





మంచిర్యాల మున్సిపల్ కార్యాలయం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల గ్రేడ్–1 మున్సిపాలిటీలో సిబ్బందితోపాటు పారిశుధ్య కార్మికుల సంఖ్య తగ్గిపోతోంది. ఓ వైపు నివాస ప్రాంతాలు, జనాభా పెరుగుతుండగా సిబ్బంది కొరత ఏర్పడుతోంది. అధికారులు ఇతర ప్రాంతాల నుంచి డిప్యూటేషన్‌పై వచ్చి పనిచేస్తుండగా, ఇక్కడ రెగ్యులర్ పోస్టు ఉన్నవారు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు తీసుకుంటుండగా, వాటిని పరిశీలించి అనుమతి ఇవ్వాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగంలోని ఖాళీలు భర్తీ చేయాల్సి ఉంది. టౌన్‌ప్లానింగ్‌లో టీపీబీవోలుగా నలుగురు పనిచేయాల్సి ఉండగా, ఒక్కరినీ కేటాయించలేదు. ప్రతియేటా రూ.50 కోట్లకు పైగా బడ్జెట్‌తో వివిధ రకాల అభివృద్ధి పనులు చేస్తుంటారు. నిధుల కేటాయింపులో సీనియర్ అకౌంటెంట్ల పాత్ర కీలకం. ఇద్దరు సీనియర్ అకౌంటెంట్లు పనిచేయాల్సి ఉండగా, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌తోనే నెట్టుకొస్తున్నారు. ఒక సీనియర్ అకౌంటెంట్ ఎస్.నాగరాజును రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి బదిలీపై కేటాయించగా, మరోపోస్టు భర్తీ చేయాల్సి ఉంది. మున్సిపల్ మేనేజర్ పోస్టు రెగ్యులర్ కాకపోవడంతో పెద్దపల్లి జిల్లాకు చెందిన వారికి డిప్యూటేషన్ ఇచ్చారు. ఇంజినీర్ పోస్టులు రెండు ఖాళీగా ఉన్నాయి. సానిటరీ ఇన్స్‌పెక్టర్లు ఇద్దరు ఉండాల్సిన చోట ఒక్కరినీ నియమించలేదు. పారిశుధ్య కార్మికులు రిటైర్ అవుతున్నా వారి స్థానంలో కొత్త వారిని నియమించడం లేదు. 2011 జనాభా లెక్కల ప్రకారమే 298 మంది పనిచేస్తుండగా, మరో 50 మంది అవసరం ఉంది. ఈ ఏడాది జూన్‌లో ఏడుగురు రిటైర్ కాగా, 60 ఏళ్లు పైబడిన 30 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల స్థానంలో కొత్తవారిని తీసుకోవాల్సిన అవసరం ఉంది. సరిపడా కార్మికులు లేక పారిశుధ్య పనులు, చెత్త సేకరణ ఇబ్బందిగా మారుతోంది.

**వెళ్లేవారే..**

ఉద్యోగులు సాధారణ బదిలీల్లో ఇతర బల్దియాలకు వెళ్లారు. వారి సంఖ్యకు అనుగుణంగా మంచిర్యాలకు రాకపోవడంతో అభివృద్ధిపై ప్రభావం చూపిస్తోంది. మున్సిపల్ హెల్త్ అసిస్టెంటు రాథోడ్ సునిల్‌కుమార్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌కు, మరో హెల్త్ అసిస్టెంట్ ఎం.వైకుంఠం బెల్లంపల్లి మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. బెల్లంపల్లి మున్సిపల్ హెల్త్ అసిస్టెంట్ టి.ఉదయ్‌కిరణ్‌ను మంచిర్యాలకు కేటాయించారు. సానిటరీ ఇన్‌స్పెక్టర్ వక్కల శ్యాంసుందర్ మందమర్రి మున్సిపాలిటీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరూ రాలేదు. శ్యాంసుందర్ గత నాలుగేళ్లుగా మంచిర్యాల మినహా ఇతర మున్సిపాలిటీల్లో డిప్యూటేషన్‌పై పనిచేసి బదిలీ అయ్యారు. రెవెన్యూ విభాగం సీనియర్ అసిస్టెంట్ మహ్మద్ మజార్ కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరికీ అవకాశం కల్పించలేదు.


**దృష్టిసారిస్తేనే అభివృద్ధి..!**

కీలక పోస్టులు ఖాళీగా ఉండడంతో అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఇంజినీరింగ్ విభాగంలో ఏఈలు ఇద్దరితోనే నెట్టుకొస్తున్నారు. ముగ్గురు రెగ్యులర్ ఏఈలు ఉండాల్సిన చోట, డిప్యూటేషన్‌పై ఇతర మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న వారితో ఇక్కడ పనిచేయిస్తున్నారు. నాలుగేళ్లకు పైగా హెల్త్ అసిస్టెంట్‌కు సానిటరీ ఇన్‌స్పెక్టర్ బాధ్యతలు అప్పగించి పనులు చేయించారు. రెవెన్యూ విభాగంలోని యూడీఆర్ఐ పోస్టు ఖాళీగా ఉండగా, ఇటీవల బదిలీపై వచ్చిన సీనియర్ అసిస్టెంట్‌కు ఆర్ఐగా అదనపు బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ స్థాయి నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు 216 మంది ఉద్యోగులు పనిచేయాల్సి ఉండగా, ప్రస్తుతం 98 మంది మాత్రమే పనిచేస్తుండగా, 118 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## ఇదీ ఫోర్‌లేన్ హైవే దారి..



బురదమయమై అధ్వానంగా మారిన రోడ్డు



గద్దెరాగిడి వద్ద నత్తనడకన కల్వర్టు పనులు

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి నుంచి మంచిర్యాల వెళ్లే నాలుగు వరుసల రహదారి బురదగా మారి వాహనదారులకు నరకం కనిపిస్తోంది. ఏడాది క్రితం చేపట్టిన రోడ్డు నిర్మాణం ఇంకా కొనసాగుతూనే ఉంది. మూడు కిలోమీటర్ల ప్రయాణం వాహన చోదకులకు ముచ్చెమటలు పట్టిస్తోందంటే ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. క్యాతనపల్లి ఎక్స్ రోడ్డు నుంచి మంచిర్యాల వరకు జాతీయ రహదారి పనులు లోపభూయిష్టంగా సాగుతున్నాయి. వర్షాలకు రోడ్డు బురదగా మారడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది. గద్దెరాగిడి వద్ద రెండు కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. వీటి వద్ద పరిస్థితి మరింత భయానకంగా మారింది. వాహనాల రాకపోకలు సాగించేందుకు కంకరతో కూడిన డస్ట్ పోయకుండా మట్టి పోయడం వల్ల వర్షాలకు బురదగా మారింది. ద్విచక్ర వాహనదారులు దారిపై ప్రయాణానికి జంకుతున్నారు. రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్య వైఖరే ఈ దుస్థితికి కారణమనే విమర్శలున్నాయి.

# ఆగని వన్యప్రాణుల వేట

- విద్యుత్ ఉచ్చులతో హతమారుస్తున్న వైనం..
- కంచె తొలగిస్తుండగా ఇటీవల ఓ వేటగాడికి షాక్
- 'మామూలు'గా తీసుకున్న అటవీశాఖ అధికారులు



గతేడాది మార్చిలో వేటగాళ్ల చేతిలో బలైన పులి ఎముకలను స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

**మంచిర్యాలక్రైం:** జిల్లాలో ప్రకృతి అందాలకు నిలయంగా ఉన్న కవ్వాల్ ఒకవైపు అటవీప్రాంతం, మరోవైపు మహారాష్ట్ర తడోబా పులుల అభయారణ్యం కలుపుకుని ఉంటుంది. ప్రాణహిత సరిహద్దులను దాటి పులులు జిల్లా అటవీ ప్రాంతంలోకి చేరుకుంటున్నాయి. కోటపల్లి, నీల్వాయి, కవ్వాల్ లాంటి అభయారణ్యంలో వేటగాళ్ల ఉచ్చులకు మూగజీవాలు బలైపోతున్నాయి. అభయారణ్యంలో ఒకప్పుడు కుందేళ్లు, పులులు, జింకలు, చిరుతలు, దుప్పులు ఎలుగుబంట్లు, నీలుగాయిలు, అడవిదున్నలు, అడవిపందులు అధికసంఖ్యలో ఉండేవి. అడవుల అభివృద్ధికి ప్రభుత్వం హరితహారం, వన మహోత్సవం పేరుతో మొక్కలు నాటుతుంటే మరోవైపు స్మగ్లర్లు వనమేధం చేయడం, వన్యప్రాణులను వేటాడడం జిల్లాలో సర్వసాధారణమైపోయింది. అటవీశాఖ అధికారుల కనుసన్నల్లోనే కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేట సాగుతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

**ఆవు, ఎద్దు మాంసం పేరిట విక్రయాలు?**

2023 మార్చిలో ఉట్నూర్‌కు చెందిన ఓ మాంసం వ్యాపారి ఆవు, ఎద్దు మాంసం పేరట అటవీ జంతువుల మాంసాన్ని లక్సెట్టిపేటకు కారులో తరలిస్తుండగా ఓ అటవీ శాఖ అధికారి పట్టుకున్నాడు. బీఆర్ఎస్‌కు చెందిన ఓ నాయకుడు జోక్యం చేసుకుని అధికారికి ముడుపులు ముట్టజెప్పడంతో విషయం సద్దుమణిగింది. సదరు వ్యాపారి అటవి జంతువులను వేటాడి ఆవు, ఎద్దు మాంసం పేరుతో రహస్యంగా ముందుగానే బుక్ చేసుకున్న వారికి కిలోకు రూ.500ల నుంచి రూ.వెయ్యి చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. జన్నారం, ఉట్నూర్, కోటపల్లి, నీల్వాయి. ర్యాలీగడ్‌పూర్, శివ్వారం, లింగన్నపేట, యెర్రాయిపేట, తిర్యాణి అటవీ ప్రాంతాల్లో కొందరు వేటగాళ్లు జంతువులను హతమార్చడం వృత్తిగా మార్చుకుని వేట మాంసాన్ని మంచిర్యాల, లక్సెట్టిపేట, బెల్లంపల్లి, చెన్నూర్, తదితర ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు సమాచారం. అటవీ జంతువులను హతమార్చిన కేసుల్లో ఎవరికీ పెద్దగా శిక్ష పడిన దాఖలాలు లేకపోవడంతో అధికారుల అండతోనే దందా సాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జిల్లాలో అటవీశాఖ అధికారులు తమ ఉనికిని చాటుకునేందుకు అడపాదడపా కేసులు నమోదు చేస్తూ అక్కడక్కడ చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి.

**కలప అక్రమ రవాణా, వన్యప్రాణుల వేటను అరికట్టడంలో అధికారులు విఫలం...**

వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా అరికట్టడంతో అటవీశాఖ అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు కొందరు అటవీశాఖలో పనిచేసే అధికారులే కలప స్మగ్లర్లు, వన్యప్రాణుల వేటగాళ్లకు సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. కోటపల్లి రేంజ్, అల్గామ ప్రాణహిత నదిలో స్వాధీనం చేసుకున్న కలప కేసులో అధికారులు చేతివాటం ప్రదర్శించిన తీరు, పార్‌పెల్లి అటవీ ప్రాంతంలో హంటింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోకపోవడం తీరును చూస్తుంటే అధికారులు 'మాములుగా' తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**మచ్చుకు కొన్ని ఘటనలు..**

- బెల్లంపల్లి మండలం రంగంపేటకు చెందిన బాలచందర్, బోర్లకుంట లక్ష్మయ్య, కొడగండ్ల అంజీ ఐదేళ్ల క్రితం పులిని హంటింగ్‌తో చంపి పాతిపెట్టారు. 2023 మార్చి 25న విషయం బయటకు పొక్కడంతో అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు వారి వద్ద నుంచి పులి ఎముకలు, గోర్లు స్వాధీనం చేసుకున్నారు.
- గతంలో మందమర్రి మండలం పులిమడుగులో వన్యప్రాణులు (అలుగులు) వేటాడి విక్రయిస్తున్న ఓ ముఠాను అటవీశాఖ అధికారులు పట్టుకుని 20 మందిపై కేసు నమోదు చేశారు.
- జన్నారం అటవీ డివిజన్ పరిధి తాళ్లపేట్ రేంజ్‌లోని రాజుగూడ శివారులో ఓ సాంబారును వేటగాళ్లు హతమార్చిన ఘటన వెలుగులోకి వచ్చింది.

## వేటకు వెళ్లి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు...!



విద్యుత్ తీగలకు తగిలి గాయపడిన రాజబాబు

కోటపల్లి రేంజ్, పారిపెల్లి బీట్ పరిధిలోని బ్రహ్మదేవునిగుట్ట నుంచి చింతలపల్లి వరకు అటవీప్రాంతంలో వన్యప్రాణులను వేటాడేందుకు ఎర్రాయిపేట గ్రామానికి చెందిన మెట్టుపల్లి రాజబాబుతో పాటు మరో నలుగురు వేటగాళ్లు విద్యుత్ తీగలతో ఉచ్చు బిగించారు. వీటికి 33 కేవీ విద్యుత్ మెయిన్ లైన్ నుంచి విద్యుత్ సరఫరా అయ్యేలా చేశారు. ఈ ఉచ్చుకు రెండు అడవి పందులు సైతం పడ్డట్లు సమాచారం. పందులను స్వాధీనం చేసుకున్న అనంతరం రాజబాబు 33 కేవీ లైన్‌కు తగిలేసిన వైర్లను తొలగించేందుకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్ తగలడంతో గాయాలపాలయ్యాడు. అతన్ని అక్కడే వదిలేసి మిగతా నలుగురు ఉచ్చుకు పడిన పందులను తీసుకెళ్లి లింగంపల్లిలో విక్రయించినట్లు సమాచారం. ఈ ఘటనను స్థానిక ఓ గల్లీ లీడర్ పోలీసులు, అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఘటన స్థలానికి వెళ్లి విద్యుత్ తీగలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కానీ విద్యుత్ ఉచ్చుకు కారణమైన వారిపై ఎలాంటి విచారణ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది.

## నిందితులు పరారీలో ఉన్నారు

కోటపెల్లి రేంజ్ పార్‌పెల్లి బీట్ పరిధిలోని అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల కోసం విద్యుత్ వైర్లను అమర్చిన వారిపై ఐదురోజుల క్రితం కేసు నమోదైంది. నిందితులు పరారీలో ఉన్నారు. వారి కోసం గాలిస్తున్నాం. విద్యుత్ వైర్లకు తాకి గాయపడిన వ్యక్తి అటుగా ఎందుకు వెళ్లాడు? వేటగాళ్లతో వెళ్లాడా? లేదా ఏదైనా పనిమీద వెళ్తే ప్రమాదానికి గురయ్యాడా? అనేది విచారణ చేస్తున్నాం.

– రమేశ్, ఎఫ్‌డీవో, చెన్నూర్

## క్లుప్తంగా

### కలప స్వాధీనం

**జన్నారం:** జన్నారం అటవీ డివిజన్ కిష్టాపూర్ పరిధిలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుష్మారావు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలోని కులువ కాయల మల్లేశ్ ఇంట్లో దాడులు నిర్వహించగా సైజులు, చెక్కలు మొత్తం కలిసి 0.0981 సీఎంటీ టేకు కలప పట్టుకున్నట్లు తెలిపారు. కలప విలువ రూ.8,463 ఉంటుందని, నిందితునిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ రేంజ్ అధికారి మమత, సెక్షన్ అధికారులు కిరణ్మై జ్యోతి, ప్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

### యువతి ఆత్మహత్య



అశ్విని (ఫైల్)

**కౌటాల:** మండలంలోని తుమ్మిడిహెట్టి గ్రామానికి చెందిన పోరేత్ అశ్విని (23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎన్.మధుకర్ తెలిపారు. అశ్విని కొన్నేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుందని, మందులు వాడినా తగ్గలేదన్నారు. కడుపునొప్పి భరించలేక ఈ నెల 18న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి తండ్రి మారుతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



లక్ష్మణ్(ఫైల్)

**కాసిపేట:** రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండల కేంద్రానికి చెందిన పెంజర్ల లక్ష్మణ్ (33) గురువారం ఉదయం సోమగూడెం నుంచి కాసిపేట వైపుకు స్కూటీపై వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి కిందపడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తండ్రి బాపు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### డప్పు కొడుతూ వ్యక్తి మృతి

**కాసిపేట:** మండల కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన రాడపాక బాపు (55) గురువారం దహన సంస్కారాల్లో డప్పు కొడుతూ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ముత్యంపల్లికి చెందిన వేల్పుల అంకులు అనే సింగరేణి కార్మికుడు అనారోగ్యంతో మృతి చెందగా మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించారు. డప్పు వాయించేందుకు వెళ్లిన బాపు కొద్దిదూరం వెళ్లగానే తలనొప్పిగా ఉందని చెప్పడంతో వెంటనే బైక్‌పై ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. మృతునికి భార్య శంకరమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గుండెపోటుతో మృతి చెందినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### హత్య కేసులో నిందితుడి రిమాండ్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

**కాసిపేట:** మండలంలోని లంబాడితండాలో మహిళను హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. గురువారం దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో హత్య వివరాలను వెల్లడించారు. లంబాడితండా(డీ)కు చెందిన అజ్మీర నీల భర్త చనిపోవడంతో పదిహేనేళ్లుగా పల్లంగూడకు చెందిన గాండ్ల రవితో సహజీవనం చేస్తోంది. రవి స్నేహితుడు గోండుగూడకు చెందిన అంబారావు సదరు మహిళను కొన్ని రోజులుగా తన కోరిక తీర్చమని వెంటపడ్డాడు. అందుకు నిరాకరించడంతో ఈ నెల 24న గొంతుపిసికి హత్య చేసినట్లు పేర్కొన్నారు.

### బోగస్ ఐటీ క్లెయిమ్స్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారి

**మందమర్రిరూరల్:** బోగస్ ఐటీ క్లెయిమ్స్‌పై ఇన్‌కంట్యాక్స్ అధికారి సూర్యభగవాన్, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఏరియాలోని సంక్షేమాధికారులకు అవగాహన కల్పించారు. ఉద్యోగుల బోగస్ ఇన్‌కంట్యాక్స్ క్లెయిమ్స్ గుర్తించడం, వాటిని నివారించడం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏరియా పర్సనల్ ఆఫీసర్ సల్ల శ్యాంసుందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డీవైపీఎం ఆసిఫ్, ఏరియాలోని గనులు, డిపార్టుమెంట్ల సంక్షేమాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న అడిషనల్ కలెక్టర్

**శ్రీరాంపూర్:** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అడిషనల్ కలెక్టర్(రెవెన్యూ) సబావత్ మోతీలాల్ అన్నారు. గురువారం ఆర్కే 5 గనిపై మొక్కలు నాటారు. కేంద్ర ప్రభుత్వ వృక్షరోపన్ అభియాన్-2024లో భాగంగా కేంద్రం బొగ్గు గనుల మంత్రి కిషన్‌రెడ్డి ధన్‌బాద్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టి అన్ని గనులపై చేపట్టాలని పిలుపునిచ్చారు. ఇటూ రాష్ట్ర ప్రభుత్వం 75వ వనమహోత్సవ కార్యక్రమాన్ని తెలంగాణ వ్యాప్తంగా చేపట్టింది. ఈ కార్యక్రమాలను పురస్కరించుకొని కంపెనీ అధికారులు ఇక్కడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు మనమిచ్చే ఆస్తి చక్కటి పర్యావరణమేనన్నారు. జీఎం సంజీవరెడ్డి మాట్లాడుతూ సింగరేణి లక్షలాది ఎకరాల్లో ప్లాంటేషన్ చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరు కనీసం రెండు మొక్కలు నాటి అవి పెరిగే వరకు కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ ఏవీ రెడ్డి, రాముడు, ఓసీపీ పీవో టీ శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఇంజనీర్ యాదయ్య, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, రక్షణాధికారి శివయ్య, ఏరియా డెప్యూటీ సీఎంవో రమేశ్‌బాబు, ఏరియా సెక్యూరిటీ అధికారి మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

# సర్టిఫికెట్లతో సొంత యూనిట్లు



ప్రశ్నపత్రాలు అందిస్తున్న రాధాకుమారి

**శ్రీరాంపూర్:** వృత్తి శిక్షణ కోర్సుల్లో సర్టిఫికెట్లు కలిగి ఉంటే సొంత యూనిట్లు పెట్టుకోవచ్చని శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి మహిళల కోసం టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, బ్యూటీషియన్ వంటి పలు వృత్తి కోర్సులను ఉచితంగా నేర్పించింది. ఇందులో నేర్చుకున్న 477 మందికి గురువారం ఆ కోర్సులకు సంబంధించిన ఖాదీ గ్రామోద్యోగ్ వారి ఆధ్వర్యంలో పరీక్ష నిర్వహించారు. శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్, నస్పూర్ కాలనీలోని సేవాభవన్‌లలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా అధ్యక్షురాలు మహిళలకు పరీక్ష పత్రాలను అందించారు. పరీక్షల్లో ఉత్తీర్ణులైతే సర్టిఫికెట్లు అందజేయడం జరుగుతుందన్నారు. మహిళలు సొంత యూనిట్లు పెట్టుకుని ఆర్థికంగా రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రీజియన్ అధికారి అనసూయ, సింగరేణి సీనియర్ పీవో కాంతారావు, సేవా సమితి కోఆర్డినేటర్ డీ.శివకుమార్, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకోవాలి



వీడియో కాన్ఫరెన్స్ వీక్షిస్తున్న జీఎం, అధికారులు

**కాసిపేట:** ప్రతిఒక్కరూ మొక్కల సంరక్షణ బాధ్యతగా తీసుకుని పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని మందమర్రి ఏరియా జీఎం మనోహర్ అన్నారు. గురువారం ఏరియాలోని కేకేఓసీ ప్రాంతమైన పెద్దనపల్లి శివారు వాగు ప్రాంతంలో వృక్షారోపన్ కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఎఫ్‌డీవో విజయ్‌కుమార్‌తో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ రాళ్లవాగు లీజ్ హోల్డ్ ఏరియాలో సుమారు మూడు హెక్టార్లలో 300ల మొక్కలు నాటినట్లు తెలిపారు. వనమహోత్సవం 2024 కార్యక్రమం తిలకించడానికి లైవ్ స్క్రీన్‌లను మొక్కలు నాటే ప్రదేశంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏరియాలో సుమారు 53 హెక్టర్లలో 2లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా యాజమాన్యం ముందుకు సాగుతుందన్నారు. అనంతరం మొక్కలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అటవీ రేంజ్ అధికారి సుభాష్, కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు రమేశ్, ఏరియా రక్షణాధికారి రవీందర్, సర్వేఅధికారి ఉజ్వల్ బందోపాధ్యాయ, ఏజీఎం ఈఅండ్‌ఎం నాగారాజు, డీజీఎం ఐఈడీ రాజన్న, కేకేఓసీ పీవో రమేశ్‌కుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ సూర్యనారాయణరాజు, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, సింగరేణి ఫారెస్టు అధికారి రమణారెడ్డి, ఎన్విరాల్‌మెంట్ అధికారి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన రోజున మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న జీఎం శ్రీనివాసులు

**జైపూర్:** ప్రతిఒక్కరూ తమ పుట్టినరోజున విధిగా మొక్కలు నాటాలని ఎస్టీపీపీ జీఎం శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో వృక్షారోపన్ అభియాన్, వన మహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకుని గురువారం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్‌ఎఫ్ ఐటీఎస్‌ఆర్ శరవణన్, కమాండెంట్ యోగేశ్ పర్మార్, అధికారులు సముద్రాల శ్రీనివాస్, ప్రసాద్, సుధాకర్, మదన్‌మోహన్, అఖిల్‌కపూర్, వాసుదేవమూర్తి, చంద్రమణి, రామశాస్త్రి, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి పర్వయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బెల్లం, పటిక పట్టివేత



పట్టుకున్న బెల్లం, పటికతో అధికారులు

**జన్నారం:** మండల కేంద్రంలోని పలు కిరాణా దుకాణాల్లో గురువారం లక్సెట్టిపేట సర్కిల్ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి బెల్లం, పటిక స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రంలోని నరేశ్ దుకాణంలో 265 కిలోల బెల్లం, 5 కిలోల పటిక, బండారు లక్ష్మీనారాయణ కిరాణంలో 20 కిలోల బెల్లం, 25 కిలోల పటిక, చింతగూడలోని బాదావత్ తుకారాం దుకాణంలో 100 కిలోల బెల్లం, పొనకల్‌కు చెందిన వట్టెం కిష్టయ్య వద్ద 6 లీటర్ల నాటుసారా, గాజుల స్వామి వద్ద 2 లీటర్ల నాటుసారా, రేండ్లగూడకు చెందిన బాదవత్ గురువయ్య వద్ద 2 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ పీ నర్సింహులు తెలిపారు. సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ గంగారెడ్డి, టాస్క్‌ఫోర్స్ సీఐ సమ్మయ్య, ఎస్సై ఇస్రతిరావు, సిబ్బంది శ్రీనివాసరెడ్డి, శ్రీనివాస్, సాగర్, వెంకటేశ్, సుజాత, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పొంగిన ప్రాణహిత



సుంపుటం అట్టలొర్రె వంతెన రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న ప్రాణహిత

**వేమనపల్లి:** ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కుమురం భీం ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడం, పెన్‌గంగ, వార్ధా నదుల నుంచి వరద వస్తుండడంతో గురువారం వరద తీవ్రత ఎక్కువై ఉగ్రరూపం దాల్చింది. పుష్కరఘాట్ వద్ద రోడ్డు పూర్తిగా మునిగిపోయింది. రాచర్ల-ముల్కలపేట మధ్య హైలెవల్ వంతెన పై నుంచి వరద ప్రవహిస్తుండటంతో అప్రోచ్‌రోడ్డు కృంగిపోయి 8 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. సుంపుటం, అట్టలొర్రే వంతెనతో పాటు జాజులపేట అంకన్న ఒర్రెవంతెన రోడ్డు మునిగిపోయాయి. ముక్కిడిగూడం ముత్యాలమ్మ గుడి వద్ద రోడ్డుపై నుంచి వరద పోటెత్తింది. ఈ మార్గంలో కల్లంపల్లితో పాటు కొమురంభీం జిల్లా దహెగాం, బెజ్జూర్ మండలాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో నాటుపడవల సాయంతో దాటుతున్నారు. లోతట్టు గ్రామాల్లో సుమారు 2,500 ఎకరాల్లో పత్తిపంట నీట మునిగింది. ప్రాణహిత వరద గంట గంటకు పెరుగుతుండటంతో ఎస్సై శ్యాంపటేల్ ప్రయాణికులను అప్రమత్తం చేశారు.

# 'అధికారుల భజనలో ఏఐటీయూసీ'



కార్మికులతో మాట్లాడుతున్న భూమయ్య

**కాసిపేట:** మందమర్రి ఏరియా కాసిపేట గని కార్మికుల సమస్యలను గాలికి వదిలేసి ఏఐటీయూసీ నాయకత్వం అధికారుల భజనలో ఉందని ఐఎన్టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య విమర్శించారు. గురువారం గనిపై ఐఎన్టీయూసీ బావి బాట కార్యక్రమంలో భాగంగా గని కార్మికులను కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మ్యాన్‌రైడింగ్ నడిపే సమయాల మార్పుపై గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ఇంత వరకు ఆ దిశగా ఆలోచన చేయకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. 9 గంటల వరకు శ్రమదానం పేరిట పనులు చేయించి అండర్‌గ్రౌండ్‌లో పనికి వెళ్లాలంటే సమయం అయిపోయిందంటూ ఆపివేయడంతో కార్మికులు నడుచుకుంటూ పని స్థలాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. ఇంత జరుగుతునా గెలిచిన ఏఐటీయూసీ నాయకులు నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. స్థానిక అధికారులతో కుమ్మక్కై కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కనీస వసతులు సైతం కరువయ్యాయన్నారు. వెంటనే యాజమాన్యం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్, ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, బత్తుల వేణు, బాపు, కన్నయ్య, గొర్ల శ్రీనివాస్, ఎర్రవెల్లి శంకర్, రాజేష్, దినేష్, శ్రీనివాస్ , రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

# అ'పూర్వ' సమ్మేళనం

**మందమర్రిరూరల్:** పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 1984-85 బ్యాచ్‌లో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు గురువారం రామకృష్ణాపూర్ రోడ్డు పక్కన గల శ్రీమంజునాథ గార్డెన్‌లో బుధవారం రాత్రి కలుసుకున్నారు. 39 సంవత్సరాల తర్వాత మిత్రులంతా ఒకేచోట కలుసుకోవడంతో ఒకరినొకరు ఆలింగనం చేసుకుని యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి హాజరయ్యారు. వెల్ఫేర్ సొసైటీ ద్వారా సేకరించిన రూ. 20 వేల చెక్కును పూర్వవిద్యార్థి కేఎల్ఆర్ కృష్ణకు అందించారు.



1984-85 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

# రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి



రైతువేదికలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** 18 నుంచి 59ఏళ్ల వయస్సు గల ప్రతీ రైతు రైతుబీమా పథకాన్నిసద్వినియోగం చేసుకోవాలని, ఆగస్టు 8లోగా జిల్లా వ్యాప్తంగా రైతువేదికల్లో అందుబాటులో ఉండే వ్యవసాయ విస్తరణాధికారి(ఏఈఓ) వద్ద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి కల్పన తెలిపారు. గురువారం హాజీపూర్ మండలం గుడిపేట రైతువేదికను సందర్శించి రికార్డులు పరిశీలించారు. రైతుబీమా, రుణమాఫీలపై ఆరా తీశారు. అనంతరం కల్పన మాట్లాడుతూ రైతుబీమా కోసం దరఖాస్తుతోపాటు రైతుపట్టా పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను అందజేయాలని తెలిపారు. పంట రుణమాఫీ సమాచారం కోసం రైతులు తమ ఆధార్ కార్డు నంబర్‌తో ఆన్‌లైన్‌లో పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎలాంటి సందేహాలు ఉన్నా రైతువేదికలో ఏఈఓలు నివృత్తి చేస్తారని తెలిపారు.